క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పట్టణ సీఐ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయటానికి ఇలాంటి టోర్నమెంట్‌లు మరన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పురుషోత్తం, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఆవుల జనార్దన్, కొమ్మా మహేష్, నవీన్, ఆవుల పుల్లారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కారెంపూడి: స్థానిక కాష్టాల గడ్డలో 11 కేవీ విద్యుత్తు లైన్ పనులు ఆదివారం జరగనున్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కారెంపూడిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ తీగల కింద నివాస గృహాలు, కొన్ని చోట్ల తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు ఉండటం వల్ల ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

జోరుగా వర్షం



మాచర్ల: పట్టణంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం 20 నిమిషాల పాటు వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. డ్రెయినేజీ పొంగి పొర్లింది. దీంతో కొద్దిసేపు ప్రజలుకు ఇబ్బంది కలిగింది. నియోజక వర్గంలో వర్షం వల్ల మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. కల్లాలో మిర్చిని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ముగ్గురు ఎంపిక



కారెంపూడి: ఎన్ఎంఎంఎస్‌కు స్థానిక ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ నయోమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు స్వాతి, సంజీవరాజు, వంశీకి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్ షిప్ వస్తుందని తెలిపారు. వీరిని సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న తహసీల్దార్ రమేష్ కుమార్, సిబ్బంది

మాచర్ల రూరల్: తోటి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే వీఆర్వో ఆరుముళ్ళ నాగేశ్వరరావు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందదాయకమని తహసీల్దార్ జి.రమేష్ కుమార్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో డీటీ వాణి, ఆర్ఐ ఫణీంద్ర, డివిజన్ అధ్యక్షుడు కడియం రాజు, వీఆర్ఓలు కొండలరావు, హుస్సేన్, కోటయ్య, అనిల్, రవి, మూర్తి, భాస్కర్, జలీల్, జీరయ్య, కాశి, ప్రశాంతి తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

దాచేపల్లి : మండలంలోని ముత్యాలం పాడుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బాలినేడి వెంకటరెడ్డి మృతదేహం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం నివాళి అర్పించారు. గుండెపోటుతో మృతి చెందిన వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనుమా రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వెంకటాచారి, ఎంపీటీసీ పాస నాగయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- గ్రామాల్లో పోలీసు శాఖ పల్లెనిద్ర
- శాంతి భద్రతలపై గ్రామస్తులకు అవగాహన



ఏకోనాం పేటలో మాట్లాడుతున్న ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి

మాచవరం: గ్రామాల్లో గొడవలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు గ్రామస్తులు కృషి చేయాలని ఎస్ఐ ఎస్.కోటయ్య కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని రేగులగడ్డ గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తోడ్పాలని కోరారు. అందరూ కలిసిమెలిసి జీవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలవాల లక్ష్మీ, ఉప సర్పంచ్ కొండలు, మాజీ సర్పంచులు తిక్కా నాగేశ్వరావు, అలవాల గోవిందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడిగొప్పులలో పల్లె నిద్ర

దుర్గి: జిల్లా ఉన్నతాధికారులు ఆదేశం మేరకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. శనివారం రాత్రి అడిగొప్పల గ్రామంలో తమ సిబ్బందితో బస చేస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో శాంతి భద్రతలను కాపాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల నిఘా పెట్టనున్నట్లు చెప్పారు. బసకు గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్, కారంపూడి సీఐ జయకుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లబోతుల చిన్నబ్బాయ్, జంగా యలమంద, నాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకోనాంపేటలో పల్లె నిద్ర

విజయపురిసౌత్: మాచర్ల మండలం ఏకోనాంపేట గ్రామంలో రూరల్ సీఐ షేక్ సమీముల్లా, విజయపురిసౌత్ ఎస్ఐ పి.అనిల్‌కుమార్ రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలని ఎస్ఐ సూచించారు. సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం గ్రామంలో..

మాచర్ల రూరల్: గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణం సృష్టించేందుకే పల్లె నిద్ర చేపడుతున్నట్లు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం రాత్రి రాయవరం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫ్రెండ్లీ పోలీసు లక్ష్యంగా.. భాగంగా ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు పల్లె నిద్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



రేగులగడ్డ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కోటయ్య



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్



అడిగొప్పలలో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

మాచర్ల పట్టణంలో..రూ.23కోట్లు జమ



పత్రాలు అందజేస్తున్న కౌన్సిలర్ పద్మావతి, అడ్మిన్ నాగార్జునరెడ్డి



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, మహిళలు

మాచర్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈవీ రమణబాబు మహిళలతో కలిసి వీక్షించారు. రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ఇది మహిళాభివృద్ధి ప్రభుత్వమని, సీఎం జగన్ మహిళా పక్షపాతి అని అన్నారు. మాచర్ల పట్టణంలో మొదటి విడతలో 666 స్వయం సహాయ సంఘాలకు రూ.7.68కోట్లు, రెండవ విడతలో రూ. 7.92కోట్లు, మూడవ విడత 675 సంఘాలకు రూ.7.80కోట్లు జమం చేసినట్లు చెప్పారు. మొత్తంగా రూ. 23కోట్లు పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రమణ బాబు మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో డ్వాక్రా మహిళలకు జరిగిన ప్రయోజనాన్ని వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు స్థానిక మేనేజర్ ఎం సుబ్బారావు, సీఓ అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా పత్రాలు పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని 17 సచివాలయాలు, 33 వార్డుల పరిధిలోని వైఎస్సార్ ఆసరా పత్రాలను ఆయా కౌన్సిలర్లు స్వయం సహాయక పొదుపు మహిళలకు పంపిణీ చేశారు. 13వ వార్డులో కౌన్సిలర్ అన్నెం పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు జూలకంటి శ్రీనివాసరావు ఆసరా పత్రాలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ నాగార్జునరెడ్డి, సెక్రటరీలు బాలరాజు, రవికుమార్, మెప్మా ఆర్పీలు శివపార్వతి, నాగేశ్వరమ్మ, డ్వాక్రా మహిళలు తదితరులు ఉన్నారు.

640 గ్రూపులకు రూ.3.76 కోట్లు

వెల్దుర్తి: మండలంలోని 640 డ్వాక్రా సంఘాల మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడవ విడత రూ.3.76కోట్లను విడుదల చేశారు. మొదటి విడత 625 గ్రూపులకు రూ. 3.70కోట్లు, రెండో విడత 640 గ్రూపులకు రూ. 3.82కోట్లు, మూడో విడతలో 640 గ్రూపులకు రూ. 3.76కోట్లు వైఎస్సార్ ఆసరా కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు శనివారం తెలిపారు. మూడు విడతలలో రూ.11.28కోట్లు విడుదల చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఎం రవికుమార్ తెలిపారు.

మహిళల ఆర్థిక భరోసా.. సీఎం లక్ష్యం

మాచర్ల రూరల్: మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.23.99 కోట్లను స్వయం సహాయ పొదుపు సంఘాలకు అందజేసినట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి జయ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరుగులు పెట్టించిన విద్యాశాఖ పీఎస్ ప్రవీణ్ ప్రకాశ్

- పల్నాడు ప్రాంతంలో సుడిగాలి పర్యటన
- పాఠశాలల తనిఖీ..విద్యార్థులతో ముఖాముఖి
- బోధన విధానం, విద్యార్థుల పఠన సామర్థ్యం పరిశీలన



బాలుర బీసీ హాస్టల్ విద్యార్థులతో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

దుర్గి/రెంటచింతల: పల్నాడు ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలకు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ వస్తున్నారన్న సమాచారంతో దుర్గి మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. దుర్గిలోని కస్తూర్బా బాలిక విద్యాలయం, ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రవీణ్ ప్రకాశ్ శనివారం సందర్శించారు. కేజీబీవీలో దాదాపుగా గంటకుపైగా విద్యార్థినులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని, ఉపాధ్యాయుల బోధనా విధానం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, పల్నాడు డీఈఓ కె.శామ్యూల్ జీసీడీఓజీ రేవతి, డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు అల్లి సురేష్, వేముల నాగయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే.. రెంటచింతల మండలంలోని మిట్టగుడిపాడు కేజీబీవీ, మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాలను ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాచారం తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను సక్రమంగా ఉపయోగించి, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కారెంపూడి: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, పరీక్షల చీఫ్‌లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 32 గదులు కేటాయించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దారు శ్రీనివాస్, ఎంఈఓ నాగయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దాచేపల్లి : స్థానిక ఎస్టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ చైర్ పర్సన్ కొప్పుల సుబ్బమ్మ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కాలనీలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఆరోగ్య సిబ్బంది ఆరా తీశారు. కాలనీలో తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కౌన్సిలర్లు శ్రీరాం పోలు, యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, వార్డు ఇన్‌చార్జి కుందురు తిరుపతిరెడ్డి, అంబటి ఆంజనేయులు, మోజేష్, పీహెచ్‌సీ డాక్టర్ సుచరిత తదితరులున్నారు.

తవ్వకాల్లో.. కాకతీయుల కాలం నాటి దేవత విగ్రహాలు



తవ్వకాల్లో బయటపడిన దేవత విగ్రహాలు

దుర్గి: దుర్గి శివాలయం ప్రధాన ఆర్చి నిర్మాణం కోసం భూమిని తవ్వుతున్న క్రమంలో శనివారం వివిధ దేవత విగ్రహాలు బయటపడ్డాయి. ఇవి క్రీ.శ. 13వ శతాబ్దం కాకతీయుల కాలం నాటివని పురావస్తు పరిశోధన పరిశీలకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. లభ్యమైన శిల్పాలలో మహిషాసుర మర్దిని, చతుర్ముఖ బ్రహ్మ, చెన్నకేశవ, చాముండి, సరస్వతీ దేవత విగ్రహాలు ఉన్నాయని స్థానిక ఆచార్య నాగార్జున శిల్ప కళాశాల అధినేత చెన్నుపాటి శ్రీనివాస్ చెప్పారు. ఈ దేవత విగ్రహాలను చూసేందుకు ప్రజలు శివాలయానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ ఈ విగ్రహాలు కాకతీయ గణపతి దేవుని కాలం నాటివని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల శిల్పాలను శివాలయంలోనే పీఠాలపై నిలబెట్టి చారిత్రక వివరాలను నామ, ఫలాలతో ఆరు బయట మ్యూజియంగా ఏర్పర్చాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

మాచవరం: కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకై పచ్చదనాన్ని పెంపొందించాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామాల్లో తనిఖీల నివేదికను డీఆర్‌పీలు వివరించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.10 కోట్ల 52 లక్షలతో పనులు చేసినట్లు చెప్పారు. అందులో కూలీల వేతన చెల్లింపులు సుమారు రూ.4 కోట్లు కాగా, మిగిలిన మొత్తం పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ద్వారా చేపట్టిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు, డ్రెయిన్ల నిర్మాణాలు, మొక్కల పెంపకం పనులు చేసినట్లు చెప్పారు. పలు గ్రామాల్లో చెరువు కట్టలపై నాటిన మొక్కలు చనిపోయినట్లు సామాజిక తనిఖీలో వెల్లడి కావడంతో, గ్రామ పంచాయతీ వాటి పరిరక్షణ బాధ్యత తీసుకొని చెట్ల పెంపకం చేపట్టి, వాటి ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు వచ్చేలా చూసుకోవాలన్నారు. మొత్తం నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కావడంతో గ్రామ పంచాయతీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ట్రీ గార్డులు, ముళ్ల కంచ ఏర్పాటు, మొక్కల సంరక్షణకై నగదు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజావేదికలో మొత్తం సుమారు రూ.20 వేలు రికవరీకి సిఫార్సు చేసినట్లు తెలిపారు. వీటిలో మస్టర్ల తప్పిదాలు మాత్రమే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సురేంద్ర కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎస్ఆర్‌పీ పున్నాపు నాయుడు, ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ వెంగళరావు, జెడ్పీటీసీ సభ్యుడు జె.శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య, నాయకులు సైదా, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: ఓ యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకుని, మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆరో వార్డు ఎన్టీఆర్ కాలనీకు చెందిన పోలూరి రమేష్‌బాబు(47) డిగ్రీ వరకు చదివాడు. వివాహం అయి పిల్లలు ఉన్నారు. మానసిక సమస్యతో బాధపడుతుండడంతో విడిపోయారు. నాటి నుంచి నాయనమ్మతో కలసి ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నాడు. అయితే మానసిక పరిస్థితి బాగోలేని రమేష్ రెండేళ్ల కిందట నాయనమ్మతో గొడవపడ్డారు. తలపై కొట్టడంతో ఆమె చనిపోయింది. అప్పటి నుంచి అతడిని ఎవరూ పట్టించుకోక పోవడంతో అనాథలా జీవిస్తున్నాడు. శనివారం పట్టణంలోని 16వ నంబర్ జాతీయ రహదారి ఓగేరు వాగు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గుంటూరు ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ లీక్..ఆయాకు గాయాలు



పిడుగురాళ్లరూరల్: గ్యాస్ లీక్ అయ్యి.. చీరకు మంటలు అంటుకోవడంతో పాఠశాల ఆయా గాయపడిన ఘటన కరాలపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్నం ఆయా మాలాంబి వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైపు లీకయ్యి.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చీరకు మంటలు అంటుకోవడంతో మాలాంబి తీవ్రంగా గాయపడింది. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు మంటలను అదుపు చేశారు. స్థానిక సర్పంచ్ షేక్ గడ్డంవలి ఆమెను ప్రథమ చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గ్యాస్ లీకైన సమయంలో విద్యార్థులు దూరంగా ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీ



ప్యాడ్‌ల పంపిణీ

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గౌరు గోపయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్‌లు అందజేశారు. శనివారం వాటిని ఎంపీపీ చింతా శివరామయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. గోపయ్య కుమారుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్పీహెచ్ఎస్‌తో పాటు ఎంపీపీఎస్, బీసీ పాఠశాల విద్యార్థులకు రూ.25 వేల విలువైన పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు అందజేయడం జరిగిందన్నారు. నర్సరావుపేట వాసవి సేవా సమితి, ఆర్యవైశ్య సమాజం, చాంబర్ ఆఫ్ కామర్స్ విద్యానిధి కమిటీల సౌజన్యంతో పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి నాగేశ్వరరావు, తాడువాయి రామకృష్ణ, గౌరు వెంకటేశ్వర్లు, మహంకాళి గోపాలరావు, మాజీ సర్పంచ్ తోట ఆంజనేయులు, జవిశెట్టి వీరయ్య, హెచ్ఎం బాలు నాయక్, సాని రఘురామయ్య, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి విద్య దోహదపడాలి

జేఎన్‌టీయూఎస్ వీసీ డాక్టర్ ప్రసాదరాజు



జేఎన్‌టీయూకే వీసీ జీవిఆర్ ప్రసాదరాజును సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ షేక్ మీరావలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు తాను నేర్చుకున్న విద్యను దేశ ప్రగతికి ఉపయోగించాలని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు ఆకాంక్షించారు. కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వీసీ డాక్టర్ ప్రసాదరాజు, తహసీల్దార్ ఆర్‌వీ రమణనాయక్, సినీ ఫొటో డైరెక్టర్ టి.రవీంద్రనాథ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. సాంకేతిక రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే దిశగా యువత కృషిచే యాలన్నారు. తహసీల్దార్ రమణనాయక్ మాట్లాడుతూ సాంకేతిక రంగంతో పాటు ప్రభుత్వ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. సినీ ఫొటో డైరెక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, దానిని గుర్తించి సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడారు. ఈ సందర్భంగా ఢీ డాన్స్ షో కళాకారుల నృత్యాలు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. జబర్దస్త్ కళాకారుల స్కిట్స్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, లియో గ్లోబల్ ఓవర్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌వీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

నరసరావుపేట: జిల్లాలో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయని పక్షంలో తమ పార్టీ నాయకులు ఇసుక రేవుల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు హెచ్చరించారు. శనివారం సత్తెనపల్లిరోడ్డులోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి ఈనెల 23వ తేదీ ఎన్‌జీటీ ఇసుక రీచ్‌లు నడపవద్దని తీర్పు చెప్పిందన్నారు. మిషనరీని ఉపయోగించకుండా మనుషులతోనే ఇసుకను తవ్వి రీచ్‌ల నుంచి బయటకు తీసుకొచ్చే విధంగా అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. పెదకూరపాడు అసెంబ్లీ పరిధిలో కోర్టు తీర్పును పట్టించుకోకుండా మూడు రోజులుగా ఇసుక తవ్వకాలను చేస్తున్నారన్నారు. సమావేశంలో నరసరావుపేట ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

సరస్వతి దేవికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో సరస్వతిదేవి

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులు గుడిలో దేవి వసంత నవరాత్రులలో భాగంగా శనివారం సరస్వతి అమ్మవారిని విశేషంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయ పూజారి వెంకటేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీరామునికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు విడేల సుందరరావు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ, సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బైక్ అదుపు తప్పి.. యువకుడి మృతి

దుర్గి: రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో కడుపు కోతను మిగిల్చింది. ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడిపోవడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం ఓబులేశునిపల్లె శివారులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. అడిగొప్పల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కందుకూరి వెంకయ్య, మరియమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్ (16) ద్విచక్ర వాహనంపై దుర్గి నుంచి అడిగొప్పలకు వెళ్తున్నాడు. ఓబులేశునిపల్లె గ్రామ శివారులో ఓ రైస్ మిల్లు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో అక్కడికక్కడే ప్రవీణ్ మృతిచెందాడు. మృతుడు ప్రవీణ్ ఏసయ్య మాల ధరించాడు. ఇంట్లో పెద కాల్వకు స్నానానికి వెళ్లి వస్తానని చెప్పిన తమ కుమారుడు విగత జీవిగా తిరిగి రావడంతో.. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమారులు తాపీ పనిచేస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్నారు. చిన్న కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.